క్లుప్తంగా

మెహర్‌బాబా బోధనలు అనుసరణీయం
–ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



చల్లపల్లి(అవనిగడ్డ):మెహర్‌బాబా బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించవచ్చని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. చల్లపల్లి మెహర్‌బాబా సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెహర్‌బాబా చేపట్టిన కార్యక్రమాలు ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని చెప్పారు. తొలుత మెహర్‌బాబా చిత్రపటానికి ఆయన పూలమాల వేసి పూజలు చేశారు. సెంటర్ అధ్యక్షుడు చుండూరి మెహర్‌ప్రసాద్, కార్యదర్శి పీవీ రమణరావు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగపడగ వితరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సూర్యారావుపేటకు చెందిన మాకినేని వెంకట విజయ కుమార్ దంపతులు వెండి నాగపడగను ఆదివారం సమర్పించారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం 950 గ్రాముల బరువుగల వెండి నాగపడగను స్వామివారికి కానుకగా ఆలయ డెప్యూటీ కమిషనర్ డీఎస్ఆర్ వరప్రసాదరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

వక్తృత్వ పోటీల్లో స్నేహ ధరణికి ప్రథమ స్థానం



మచిలీపట్నంటౌన్:విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇంటెలిజెన్స్ ఎవేర్‌నెస్ వీక్ – 2024 పోటీల్లో స్నేహధరణి జిల్లా స్థాయి ప్రథమ స్థానాన్ని సాధించింది. స్థానిక రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ అండ్ నేషన్స్ ప్రాస్పరిటీ అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో స్థానిక జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న స్నేహ ధరణి జిల్లా స్థాయి ప్రథమ బహుమతిని పొందింది. విద్యార్థిని డీవైఈవో శేఖర్‌సింగ్ అభినందించి బహుమతి అందజేశారు. స్నేహ ధరణిని ఆమెకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు నాగలక్ష్మిని ప్రిన్సిపాల్ ఎం .సత్యనారాయణ అభినందించారు.

డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్

మచిలీపట్నంటౌన్: కొద్ది నెలల క్రితం కొండరాళ్లతో వస్తున్న టిప్పర్ సెంట్రల్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన మరువక ముందే ఆదివారం మరో టిప్పర్ డివైడర్‌ను ఢీకొంది. కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఇంజిన్ దెబ్బతింది. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఉండటంతో ప్రతిరోజు విద్యార్థులు రోడ్డు దాటుతూ ఉంటారు. ఆదివారం కావటంతో రద్దీ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత చదువులకు ఆర్థిక సాయం



పెడన:పట్టణంలోని 23 వార్డుకు చెందిన పేరక శంకర్ రావు కుమార్తె సాయి హర్షిత ఉన్నత చదువులకు ఏలూరుకు చెందిన దేవాంగ ప్రముఖుడు కొండపల్లి పరమేశ్వరరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. సాయి హర్షిత గత ఏడాది ఇంటర్‌లో 948 మార్కులతో కాలేజ్ టాపర్‌గా నిలిచిందని, ప్రస్తుతం గుడ్లవల్లేరు కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు పెడన దేవాంగ యూత్ సేవా సమితి దృష్టికి తీసుకొచ్చారని మున్సిపల్ మాజీ చైర్మన్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు భండారు ఆనందప్రసాద్ అన్నారు. సేవా సమితి వారు ఏలూరులో దేవాంగ కల్యాణమండపం ఆడ్మిన్ అయినటువంటి పరమేశ్వరరావును స్పందించి ఆర్థిక సాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శివశంకర్, కాలపు సూరిబాబు, దేవాంగ యూత్ సేవా సమితి అధ్యక్షుడు సుధీర్‌కుమార్, వీరకోట సుబ్రహ్మణ్యం, కోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివిసీమలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- ఇసుక దందా అంతా ఎమ్మెల్యే మనుషులదే
- అడ్డుకుంటున్న గ్రామస్తులపై బెదిరింపులు
- ఎమ్మెల్యే మాటలు బేఖాతర్ చేస్తున్న జనసేన నాయకులు



నాగాయలంక నది ఒడ్డున పడవల నుంచి ట్రాక్టర్లలోకి ఇసుక లోడింగ్

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల అడ్డుకుంటున్న గ్రామస్తులను జనసేన పార్టీ, టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. ఇసుక, మద్యం విషయంలో ఎక్కడా తలదూర్చవద్దని చెప్పిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పిన మాటలను బేఖాతర్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొత్త ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధి, పోలీసు, రెవెన్యూ అధికారులు చోద్యం చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెలవు వస్తే పండుగే....

రెవెన్యూ అధికారులకు ఒకరోజు సెలవు వచ్చిందంటే ఇసుక మాఫియాకు పండుగే. ఒకరోజు ముందే ఇసుక అక్రమ రవాణాకు తెగబడతారు. శనివారం నుంచి దివిసీమలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేపట్టారు. అవనిగడ్డ మండలం దక్షిణ చిరువోలులంక, మోపిదేవి మండలం కోసూరువారిపాలెం, కె. కొత్తపాలెం, ఘంటసాల మండలం పాపవినాశనం, శ్రీకాకుళం, నాగాయలంక నవలంక, కోడూరు మండలం విశ్వనాథపల్లి, చల్లపల్లి మండలం ఆముదార్లంక, నిమ్మగడ్డ, నడకుదురులో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ జరుగుతుంది. ఆదివారం ఇసుక మాఫియా మరింత రెచ్చిపోయింది. కొన్నిచోట్ల పొక్లెయిన్‌లతో ఇసుకను లోడు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

గ్రామస్తులను బెదిరిస్తున్న జనసైనికులు..

మోపిదేవి మండల పరిధిలోని కోసూరివారిపాలెంలో ఇసుక అక్రమ రవాణాని స్థానికులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున ట్రాక్టర్లను, పొక్లెయిన్‌ను తీసుకొచ్చి ఇసుక లోడింగ్‌కు సిద్ధపడిన జనసైనికులు, టీడీపీ నేతలను స్థానికులు అడ్డుచెప్పారు. ఈ సందర్భంగా స్థానికులపై జనసైనికులు బెదిరింపులకు పాల్పడినా వెనుకడుగు వేయక పోవడంతో ఇసుక అక్రమ రవాణా జరగలేదు. నాగాయలంక శ్రీపాద క్షేత్రంకు కూతవేటు దూరంలో నవలంకలో ఏర్పడిన ఇసుక తిన్నెలపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడ నుంచి పడవల్లో ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేశారు. ఇక్కడ నదిఒడ్డున పెట్టిన ట్రాక్టర్ల వల్ల కార్తీక మాసం పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చల్లపల్లి మండలం ఆముదార్లంక, నడకుదురు, నిమ్మగడ్డ, ఘంటసాల మండలం పాపవినాశనం, శ్రీకాకుళం, కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్పందించని అధికార యంత్రాంగం....

నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా, మద్యం , జూదం వ్యవహారాల్లో తలదూర్చి పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బహిరంగంగా ఎన్నో సార్లు చెప్పారు. అయినా ఆయన మాటలను జనసేన నాయకులు లెక్కచేయడం లేదు. నియోజకవర్గంలో పలుచోట్ల జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా, మద్యం, ఇతర జూదాల్లో కొంతమంది జనసేన నాయకులు ముందుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నా ఎమ్మెల్యే, పోలీసు, రెవెన్యూ యంత్రాంగం స్పందించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా స్పందించి ఇసుక అక్రమ రవాణా, మద్యం, జూదాలను అరికట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ తరలింపు
అడ్డుకున్న గ్రామస్తులు

- అనుమతులు ఉన్నాయని బుకాయించిన పొక్లెయిన్ ప్రతినిధులు
- రెవెన్యూ అధికారులు రావడంతో వెనుదిగిన ఇసుక ట్రాక్టర్లు



కోసూరువారిపాలెంలో పొక్లెయిన్, ట్రాక్టర్లును అడ్డుకుంటున్న గ్రామస్తులు

కోసూరువారిపాలెం(మోపిదేవి):ఇసుక అక్రమ తరలింపును గ్రామస్తులతో కలసి వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. అనుమతులు ఉన్నాయని బుకాయించిన పొక్లెయిన్ ప్రతినిధులు రెవెన్యూ అధికారుల రంగప్రవేశంతో కిమ్మనకుండా వెనుదిరిగిన వైనం మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని కోసూరువారిపాలెం, నాగాయితిప్ప పులిమేర కృష్ణానది గర్భంలో పొక్లెయిన్ సాయంతో ఇసుక తవ్వి అక్రమంగా తరలింపునకు కూటమి నాయకులు ప్రయత్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నదిలోకి వెళ్లడానికి వీలులేదని, కాదని వెళితే వాహనాలకు అడ్డుగా పడుకుంటామని స్థానికులు హెచ్చరించారు. మోపిదేవి మండలం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నందున ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని ఇటీవల స్థానిక తహసీల్దార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాక్షాత్తూ సీఎం చంద్రబాబునాయుడు సైతం ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ యథేచ్ఛగా రవాణా జరగడం స్థానిక అధికారుల వైఫల్యం కారణంగా మారుతుంది. అధినేత ఆదేశాలను విస్మరిస్తున్న నాయకులకు అవి శాపాలు కాగలవని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకుండా, సీఆర్‌జెడ్ పరిధిలోని నదిలో ఇసుక ఎలా తరలిస్తారని కోసూరువారిపాలెం, నాగాయితిప్ప గ్రామాల ప్రజలు నిలదీశారు. తమ వద్ద అనుమతులు ఉన్నాయని జెసీబీ వారు వాదనకు దిగడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారి వెంటనే రావడం, ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నదిలోకి దిగిన టాక్టర్లు, జెసీబీ కూడా వెంటనే తీసుకెళ్లాలని లేని పక్షంలో కేసు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. గత నెల 25న తహసీల్దార్ శ్రీవిద్య స్థానిక ఎస్ఐ సత్యనారాయణతో కలసి మండలం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నందున ఎలాంటి ఇసుక, బుసక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారని గుర్తు చేయడంతో మెల్లగా జారుకున్నారు.



సీఆర్‌జడ్ పరిధిలోని మండలంలో ఇసుక తవ్వకాలు లేవని ఇటీవల స్పష్టం చేసిన తహసీల్దార్ శ్రీవిద్య, ఎస్ఐ సత్యనారాయణ

శివపూజకు వేళాయే..

- నగరంలో కార్తీక పూజలకు సిద్ధమైన శైవక్షేత్రాలు
- నేడు కార్తీక సోమవారం పూజలు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్యాన ముద్రలో ఉన్న పరమశివుని విగ్రహం



ఉత్సవాలకు సిద్ధమైన చిలకలపూడి పాండురంగస్వామి ఆలయం

మచిలీపట్నంటౌన్:పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసంలో సోమవారం శివపూజ చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. నగరంలోని పలు శైవక్షేత్రాల్లో కొలువైన పరమశివుడు భక్తుల పూజలు అందుకోనున్నారు. కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున పవిత్ర స్నానమాచరించి ఆలయాలకు వచ్చి పూజలు చేసేందుకు భక్తులు ఎంతో నిష్ఠగా వస్తారు. నగరంలో చారిత్రక శైవక్షేత్రాల్లో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించనున్నారు. చిలకలపూడిలో వేంచేసియున్న శ్రీ పాండురంగస్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ కార్తీక పౌర్ణమి రోజు వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. పౌర్ణమి రోజున సముద్ర స్నానాలు ఆచరించి పాండురంగస్వామిని దర్శించుకుంటే మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. ఆ రోజు భక్తులతో పాండురంగస్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు కిటకిటలాడతాయి. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ పర్వత వర్ధిని శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని 35 అడుగుల ధ్యానముద్రలో ఉన్న పరమశివుని విగ్రహం వద్ద దీపారాధనలు, పూజలు చేయనున్నారు. ఆలయంలో శనివారం ప్రారంభమైన పూజలు డిసెంబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని పరమశివుని విగ్రహం వద్ద ఈ నెల 20వ తేదీన కోటి దీపోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. 24న స్వామివారికి అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన, రాత్రికి అన్నసమారాధన నిర్వహించనున్నారు. 29న సహస్ర దీపారాధన నిర్వహించనున్నారు. ఖొజ్జిల్లిపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆలయానికి భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో తరలివచ్చి అభిషేకాలు, పూజలు, దీపారాధనలు చేయనున్నారు. ఈ ఆలయానికి సుమారు 250 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో 40 రోజుల పాటు ప్రదిక్షణలు చేసి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనేది భక్తుల నమ్మకం. అలాగే నగరంలోని బచ్చుపేట, గొడుగుపేట, చింతగుంటపాలెం, గాంధీబొమ్మ శివాలయం, ఈడేపల్లి జోడుగుళ్లు, నాగులేరు కాలవ ఒడ్డున ఉన్న రసలింగేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించనున్నారు.

వేకువజామునే గందరగోళం



నదిలో నుంచి పడవల్లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

నాగాయలంక: శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌లో ఆదివారం వేకువజామున గందరగోళం చెలరేగింది. కృష్ణానదిలో ఇసుకను పడవలతో తోడేసి ఘాట్‌లో ట్రాక్టర్‌లలో లోడింగ్ చేయడమే ఈ ఆందోళనకు కారణమైంది. సీఆర్‌జడ్ నిబంధనలకు పూర్తిగా తిలోదకాలిచ్చి ఏకంగా బ్యాక్ వాటర్‌తో నిండైన నదిలో ఇసుకను తోడి కృష్ణమ్మకు గర్భశోకం కలిగిస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బాపట్ల జిల్లా మంత్రి అండదండలతో ఈ దుశ్చర్యలకు దిగారా అనే సందేహాలు కూడా వినిపించాయి. పడవలు రేపల్లె మండలం పెనుమూడికి చెందినవి కావడం ఇందుకు దోహదపడుతుంది. ఎస్ఐ కలిదిండి రాజేష్ సిబ్బందితో హుటాహుటిన రంగంలోకి దిగి ఇసుక దందాకు బహిరంగంగా తెరలేపిన వ్యక్తులపై కేకలు వేసి మందలించారు. చివరికి నదిలో ఇసుకతో లోడ్ చేసిన ట్రాక్టర్‌లను పంపించేయడం, రేవులో పడవల్లో ఉన్న ఇసుకను లోపలికి తరలించి నవలంక సమీపంలో దిగుమతి చేయించడం జరిగిపోయింది. ఈ ఘటనలపై ఏవిధమైన కేసులు నమోదు చేయలేదని సాక్షితో చెప్పారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పాల రాము



కృత్తివెన్నులో మాట్లాడుతున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను:వైఎస్సార్ సీపీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే పార్టీ కార్యకర్త గుగ్గిళ్ల జయరాజ్ తల్లి రామానుజమ్మ ఇటీవల మరణించారు. జయరాజ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను రాము పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో ఆయనతో పాటు కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, ఆర్టీసీ కృష్ణారీజనల్ మాజీ చైర్మన్ పి. మహేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంగాధర్, అగ్రికల్చరల్ జిల్లా బోర్డు మాజీ సభ్యులు పట్టపు నాని, పెడన వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కె. నాగబాబు, పెడన మాజీ ఎంపీపీ అచ్యుతరావు, కృత్తివెన్ను ఎంపీటీసీ విజయకుమారి, సుగుణకుమార్ ఉన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌తో భయాందోళన



14వ వార్డులో అంతర్గత రహదారి మలుపు వద్ద ద్విచక్ర వాహనాలపై మైనర్లు

పెడన:పద్దెనిమిది సంవత్సరాలు కూడా నిండని మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలను నడుపుతూ తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సరిగ్గా డ్రైవింగ్ వచ్చో...రాదో తెలియదు...ఎటుగా వెళ్తున్నారో చూస్తుండానే దూసుకుపోతున్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు. 18 సంవత్సరాలు నిండిన వారికి ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని చట్టం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కొందరు బాలురు ద్విచక్ర వాహనాలతో ప్రధాన రహదారులపైకి వచ్చేస్తున్నారు. ఇటు పోలీసులు కూడా వీరి గురించి అస్సలు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా పురవీధుల్లో తిరుగుతూ పాదచారులను, ఇతర ద్విచక్ర వాహనదారులను మరింత భయాందోళనలకు, గురిచేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మైనర్లుకు ద్విచక్రవాహనాలను ఇచ్చిన పేరంట్స్‌కు జరిమానాలు విధించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఇటువంటి వారి విషయంలో కౌన్సెలింగ్ ఇస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లుగా ఉంటుందని పురప్రజలు కోరుతున్నారు.

తెలుగురావుపాలెంలో నేత్రదానం



తెలుగురావుపాలెం(ఘంటసాల):మరణించిన తర్వాత కూడా జీవించే అవకాశం అవయువ దానం ద్వారానే సాధ్యమని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అన్నారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన తలకటూరి అశోక్ (33) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉండగా సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు నేత్రదానం ప్రాముఖ్యతను అశోక్ భార్య, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి నేత్రదానం చేసేలా ఒప్పించారు. దీంతో విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యులు మృతుడు అశోక్ భౌతికకాయం నుంచి నేత్రాలను సేకరించారు. మరణించిన అశోక్‌కు భార్య, ఇద్దరు చిన్నారులు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న అశోక్ మరణంతో కుటుంబం సభ్యులు ఏడుస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. గ్రామంలో మొట్టమొదటిసారిగా నేత్రదానంకు అంగీకరించిన అశోక్ కుటుంబ సభ్యులను గ్రామస్తులు, ప్రముఖులు, సర్పంచ్ ప్రసాద్ బాబు అభినందించారు.

ఇసుక కోసం ఇరువర్గాల వివాదం



శ్రీకాకుళంలో ఇసుక తవ్వకాలపై ఇటీవల మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి (ఫైల్)

శ్రీకాకుళం(ఘంటసాల):కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీ గ్రామాల్లో ఉద్రిక్తతకు దారితీస్తుంది. కృష్ణానది లంక భూముల్లో దీపావళి రోజున భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు చేపట్టగా అధికారులు నిలుపుదల చేశారు. గత శుక్రవారం బందరు ఆర్డీవో స్వాతి ప్రభుత్వం గుర్తించిన ఇసుక క్వారీలను పరిశీలించారు. నదిలో నీరు తగ్గే వరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా, అనుమతుల్లేని ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లంక భూముల సొసైటీ సభ్యులు, కూలీలను సైతం హెచ్చరించారు. అధికారులకు సైతం తవ్వకాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆదివారం లంక భూములకు చెందిన కొందరు వ్యక్తులు ఇసుక తవ్వేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రెండు వర్గాల్లో మాకు తెలియకుండా ఇసుక ఎలా చేపడతారని ఒకరి మధ్య ఒకరికి వాదనలు జరిగాయి. ఇసుక బాటకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.100 చొప్పున వసూలు చేసే లెక్కన శ్రీకాకుళం పరిధిలోని ఎడ్లబండ్లకు ఇసుక తవ్వుకునేలా అవకాశం కల్పించాలని ఎడ్ల బండ్ల యజమానులు, నిర్వాహకులకు మధ్య గలాట జరగడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయినట్లు తెలిసింది. దీంతో అక్కడకు వచ్చిన ఇసుక ట్రాక్టర్లు వెనుకకు వెళ్లిపోయాయని, సోమవారం నుంచి ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు అవినీతిని వ్యతిరేకించాలని స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. సుందరలక్ష్మి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ప్రతినిధులు విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థినులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బెల్ కంపెనీ విజిలెన్స్ అధికారి కె.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సమాజంలో అవినీతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎల్.హరనాథ్‌బాబు, అధ్యాపకులు మమత, హిరణ్మయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం



కోనేరుసెంటర్:పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వింగ్స్ అండ్ అవుట్ రీచ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాతపాటి దేవదాస్ పిలుపునిచ్చారు. వింగ్స్ అండ్ అవుట్ రీచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగినపూడి బీచ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. ఒడ్డున ఉన్న చెత్తాచెదారాన్ని ఎత్తివేశారు. ప్లాస్టిక్ వస్తువులను సంచుల్లోకి ఎత్తి దూరంగా వేశారు.

హంసలదీవి బీచ్‌లో పర్యాటకుల సందడి



కోడూరు:హంసలదీవి బీచ్ పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. కార్తీకమాసం ఆరంభం కావడంతో మహిళలు తీరం వెంట దీపాలు వెలిగించి భక్తి భావం చాటారు. సైకత శివలింగాలు చేసి ఆకట్టుకున్నారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట గస్తీ నిర్వహించారు.